ముందస్తు వరికోతలు

- వాతావరణ మార్పులతోనే అంటున్న రైతులు
- ఇంకా ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- అగ్గువసగ్గువకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకం


పచ్చిపచ్చిగానే ఉన్న వరిని కోస్తున్న హార్వెస్టర్

లింగాలఘణపురం: రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పుల నేపథ్యంలో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. కొంత గింజ పచ్చిపచ్చిగా ఉండగానే ముందస్తు వరికోతలు మొదలుపెట్టారు. యాసంగి పంట అంటేనే చేతికొచ్చే దాకా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది యాసంగిలో వరుసగా వడగళ్ల వానలు, గాలి దుమారాలు చెలరేగడం జరుగుతున్న నేపథ్యంలో ముందుగానే కోసుకుందామనే ఆలోచనలో పడ్డారు. మండలంలో యాసంగి వరిసాగు 13,200 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల రికార్డులో ఉండగా ఇప్పటికే కొంత మంది రైతుల వరి నీరులేక ఎండిపోయాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరిని కాపాడుకొనేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక వర్షం కురిస్తే ఆరుగాలం కష్టపడిన పంట ఎక్కడ నేలపాలవుతుందోననే ఆందోళనలో కోతలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా ఇటీవల జిల్లా స్థాయిలో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి పచ్చిపచ్చిగా ఉన్న వరి కోత కోయవద్దని కూడ సూచించినట్లు సమాచారం.

ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

ఒకవైపు రైతులు ముందస్తుగా వరికోతలు మొదలుపెట్టగా ప్రభుత్వం మాత్రం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలను మొదలు పెట్టలేదు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు 11, పీఏసీఎస్ సొసైటీలు 5 కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా నేటికి ఒక్కటి కూడా ప్రారంభించ లేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అగ్గువసగ్గువకు అమ్ముకుంటున్నారు. క్వింటాకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యం ఏ-గ్రేడ్ రూ.2,320 కాగా బీ-గ్రేడ్ రూ. 2,300, సన్నరకం ధాన్యానికి అదనంగా బోనస్ రూ.500లు కాగా ప్రైవేట్‌లో క్వింటాళ్లకు రూ.1,700లకే విక్రయించినట్లు కొంత మంది రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు కొంత బరోసా ఉంటుందని, కోసిన ధాన్యం ఆరబెట్టుకొనేందుకు నమ్మకం కలుగుతుందని అంటున్నారు.

వానపడితే ఇక అంతే..



రెండు రోజులుగా మబ్బులు వస్తున్నాయి. రాత్రి కొంత వర్షం కురిసింది. ఇక మరీ ఎక్కువ కురిస్తే అంతే..ఇప్పుడేమో రాళ్ల, గాలి దుమారాలు వస్తాయని అంటున్నారు. ఏం చేయాలే కోసుకుని బయటపడితే అంతేచాలు. తొందరగా కొనుగోలు కేంద్రాలు మొదలు పెట్టాలే.

- కేమిడి విజయ్, రైతు, లింగాలఘణపురం

ఆకాశంలో మబ్బులు.. రైతుల గుండెల్లో గుబులు

అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు కోతకు సిద్ధమైన వరి, మరో వైపు ధాన్యం అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులు సరుకును కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. మేఘావృతమవుతున్న ఆకాశాన్ని చూసి కలవరపాటుకు గురవుతున్నారు. వరి కోతలు ముగిసి, అమ్ముకునే వరకు కరుణించాలని వరుణదేవున్ని రైతులు వేడుకుంటున్నారు. **- జనగామ**


పట్టణంలో మేఘావృతమైన ఆకాశం

మూలధన సమీకరణపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని క్రీస్తుజ్యోతి సాంకేతిక విజ్ఞాన సంస్థలో ఇనిస్టిట్యూషనల్ ఇన్నొవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టార్టప్లకు 'మూలధన సమీకరణ–ఆర్థిక నిర్వహణ' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ శివకృష్ణ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై స్టార్టప్లకు అవసరమైన ఆర్థిక మద్దతులు, పెట్టుబడుల సాధన, ప్రభుత్వం అందించే పథకాలు, వ్యాపార నిర్వహణ అంశాలపై వివరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్ రెడ్డి విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఐఐసీ అధ్యక్షుడు యాకూబ్, కో ఆర్డినేటర్లు అనిత, డాక్టర్ వీరు, శ్రీజ, ఉదయ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూ నిర్వాసితులకు పరిహారం విడుదల చేయాలి


వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తిటౌన్: చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహారం వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదారబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా పరిహారం విడుదలకు సంబంధిత అధికారులను ఆదేశిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న విజేందర్, స్వీపర్లు

జనగామ రూరల్: జనగామ ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ స్వాతికి వినతిపత్రాన్ని అందజేశారు. కమల, రేణుక, శోభ, స్వప్న స్వరూప, సువార్త, కోమల, లక్ష్మి, రేణుక, శోభ పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ఉద్యమం

జనగామ రూరల్: గ్రామీణ జర్నలిస్టులకు వేతనాలు, సౌకర్యాల కల్పనకు రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపట్టనున్నట్టు బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా డబ్ల్యూజేఐ కన్వీనర్ పులి శరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ జర్నలిస్టులు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలకు నోచుకోలేక పోవడం శోచనీయమన్నారు. యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కుంకుమార్చన



జనగామ రూరల్: పట్టణంలోని పాతబీటుబజారులోని సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామివారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యవర్గ సభ్యులు ఐతే శ్రీకాంత్, కందుకూరి శ్రీనివాస్, బచ్చు అశోక్, నందు, పాండు, మారం ప్రవీణ్, గోవింద్ లోహియ పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు

జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న సంతోషిమాత దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు, కుంకుమ, గాజులు, పూలు, వస్త్రాలతో అలంకరణ చేశారు. అర్చకులు పారునంది శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనల మేరకు ప్రణాళికతో కష్టపడాలని కేయూ మాజీ వీసీ వంగాల గోపాల్‌రెడ్డి అన్నారు. శివునిపల్లిలోని సేయింట్‌థామస్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కేసీ జాన్‌బన్నీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ప్రముఖ కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ ఇవాన్‌జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి

బచ్చన్నపేట: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు గట్టు రామచంద్రం పదవీ విరమణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, మండల అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి


ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న ఉద్యమకారులు

జనగామ రూరల్: జిల్లా ఉద్యమకారులపై ఉన్న అక్రమ కేసులను ఎత్తివేయాలని జేఏసీ అధ్యక్షుడు పిట్టల సురేష్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఐక్యమత్యంగా పోరాటం చేసి జిల్లాను సాధించుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఉద్యమకారులు విద్యార్థులపైన నమోదైన కేసులపై కోర్టుకు వెళ్తున్నామన్నారు. అక్రమ కేసులు పెట్టడంతో విద్యార్థి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పూర్తి వివరాలు సేకరించి సంబంధిత అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోముల శ్రావణ్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్, వినోద్ నాయక్, అనిల్, ఈశ్వర్, సాయి, చందు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు

కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్య తీసుకోవాలి

డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి


నర్మెట: సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట/బచ్చన్నపేట: రాజ్యాంగాన్ని అవమానిస్తూ నియంతృత్వ పోకడలతో ప్రవరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై తక్షణం చర్యలు తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, మండల ఇన్‌చార్జ్ మోటె శ్రీనివాస్ అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అధ్యక్షతన మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జై బాబు, జై భీం, జై సంవిధాన్‌పై బీజేపీ అనుసరిస్తున్న దుష్ప్రచారాన్ని ప్రతీ కార్యకర్త తిప్పికొట్టాలని అన్నారు. జిల్లా, మండల నాయకులు కుమారస్వామి, యాదయ్య, జయరాం, భాగ్యలక్ష్మి, బాలచందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంపై కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద బైపాస్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 68 రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో అండర్‌పాస్ నిర్మించాలని నిరసన దీక్షలు చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఉపయోగపడే అండర్ పాస్‌ను నిర్మించాలని కోరారు. సుంచు విజేందర్, బోడ నరేందర్, కళ్యాణం లింగం, పందిళ్ల కళ్యాణి మంగ బీరయ్య, గుండె మల్లేష్ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఉపాధి పొందాలి


కొవ్వొత్తుల తయారీపై అవగాహన కల్పిస్తున్న కుమారస్వామి

- ఐకేపీ ఏపీఎం కుమారస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్: మహిళలు స్వశక్తితో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ స్వయం ఉపాధి పొందాలని ఐకేపీ ఏపీఎం కుమారస్వామి అన్నారు. మహిళా సంఘాలకు చెందిన మహిళలకు మండలంలోని శివునిపల్లిలో అనిత ఎంటర్‌ప్రైజెస్ వద్ద కొవ్వొత్తులు, వెల్వెట్ పెన్సిళ్ల తయారీపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎం మాట్లాడారు. మహిళలు ఇంటి వద్దనే ఉంటూ కొవ్వొతులు, వెల్వెట్, పెన్సిళ్ల తయారీతో నెలకు రూ.20వేలకు పైగా సంపాదించవచ్చని తెలిపారు. ఈ విషయమై వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలకు అవగాహన కల్పించి ప్రత్యక్షంగా తయారీ విధానాన్ని చూపించారు. సీసీలు కుమార్, యాదగిరి, రజిని, ఉమారాణి, రమ్య, శివునిపల్లి నవయుగ వీఓఏ వసంత, మేకల రాంచంద్రు, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్‌బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలి'

జనగామ రూరల్: వక్ఫ్ బోర్డు బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని, తక్షణమే బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జమాల్ షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నమాజ్ అనంతరం ఏక్ మినార్ మక్కా మసీద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రఫీక్, మీయన్ బాయ్, ముజ్జు, గౌస్, అజీమ్, బాబా, రహమాన్, జానీ, ముస్తాఫా, అన్వర్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ పేద వర్గాల పక్షపాతి అని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రాఘవాపూర్, ఛాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో శుక్రవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, సీహెచ్.నరేందర్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రశ్నించిన మహిళలు

సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమానికి స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఎస్సీ కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాలనీకి చెందిన మహిళలు తాగునీటి సమస్యపై అడిగారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా పలువురు మహిళలు తమ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మసూద్

బచ్చన్నపేట/దేవరుప్పుల: బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో కొడవటూరు దేవస్థాన మాజీ చైర్మన్ గాలి కృష్ణ, మాజీ ఎంపీటీసీ మహ్మద్ మసూద్, దేవరుప్పుల మండలంలోని ధర్మాపురంలో కాంగ్రెస్ నాయకుడు బియ్యం పంపిణీ ప్రారంభించారు. నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: నూతనంగా ఏర్పడిన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్మికుల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు ఘన్‌పూర్‌లో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా నీల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా పి.నర్సింహులు, సింగపురం చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎడ్ల రాజు, సింగపురం అనిల్, గుండ్లపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి గూడూరు పూర్ణచందర్, సహాయ కార్యదర్శి గుర్రం వినయ్, కోశాధికారి కొంతం చిరంజీవి, సహాయ కోశాధికారి వేల్పుల స్వామి, ప్రచార కార్యదర్శులు గుర్రం శ్రీనివాస్, సింగపురం ప్రమోద్, జక్కుల మహేష్‌తో పాటు 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నీల శ్రీనివాస్ మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అభినందనీయం


బ్యాగులు అందుకున్న విద్యార్థులతో టీచర్ ప్రతిభ

పాలకుర్తి: విద్యార్థులకు టీచర్ ప్రతిభ బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈఓ పోతగంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం వావిలాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల టీచర్ ప్రతిభ బదిలీపై వెళ్తూ విద్యార్థులకు బ్యాగులను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ విద్యార్థులకు బ్యాగులు అందజేసి ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తండ మల్లయ్య, టీచర్లు గౌరి, రాజమణి, రాజ్‌కుమార్, కృష్ణయ్య, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ స్వరూపారాణి

నర్మెట: వేవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని, వందశాతం పన్నుల వసూలు చేయాలని డీపీఓ నాగపురి స్వరూపా రాణి అన్నారు. స్థానిక జీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అంగడి వేలం పాట కార్యక్రమంలో ఎంపీడీఓ అరవింద్ చౌదరితో కలిసి పాల్గొన్న ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. జీపీ కార్యదర్శి శ్రీధర్, బిల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి , పాటదారులు పాల్గొన్నారు.

'కుంట స్థలం కబ్జా ఆరోపణలు అవాస్తవం'

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామ శివారులోని తెట్ట(బసిరెడ్డి)కుంట స్థలాన్ని కబ్జా చేశామని తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని రైతులు బసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. తమ సొంత పట్టా భూమికి చెందిన సర్వే నంబర్ 500లో చదును పనులు చేశామని, కొందరు ఉద్దేశపూర్వకంగా తమపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి హక్కు పత్రాలు తమ వద్ద ఉన్నాయని, ఎలాంటి విచారణకైనా తాము సిద్ధమన్నారు. తప్పుడు ఆరోపణలతో కొందరు అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఐదు నెలల క్రితం చేసిన పనులపై ప్రస్తుతం రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని, తమపై ఆరోపణలు చేస్తున్నవారు అధికారుల సమక్షంలో విచారణకు రావాలని సూచించారు. రైతులు మహిపాల్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన తానేదార్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మాచర్ల ఎల్లయ్య(60) అనే గీత కార్మికుడు శుక్రవారం గ్రామ శివారులోని తాటిచెట్టు నుంచి కల్లు తీసేందుకు ఎక్కాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు, గీత కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రమీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని గీత సొసైటీ గ్రామ అధ్యక్షుడు మాచర్ల గణేష్ డిమాండ్ చేశారు.

ఎల్‌ఓసీ అందజేత



రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ శేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, చికిత్స నిమిత్తం మంజూరైన రూ 2.5 లక్షల ఎల్ఓసీని బాధితుడికి మండల కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, కావటి భాస్కర్‌యాదవ్, చెంచు రమేష్, అరూరి శ్రీనివాస్ ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జనగామ రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. గోపరాజుపల్లి గ్రామానికి చెందిన లింగాల నర్సిరెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కిరణ్ కుమార్.. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. కాగా, శుక్రవారం ఎల్‌ఓసీని కిరణ్‌కుమార్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులకు అందజేశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గనిపాక మహేందర్, నర్సింగరావు, కె.కరుణాకర్ రెడ్డి, కొన్నె మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ రాజిరెడ్డి, లింగాల రాజేందర్ రెడ్డి, ఉదయ్ తదితరులు ఉన్నారు.

ఒంటిమామిడిపల్లి పాఠశాల సందర్శన

రఘునాథపల్లి: ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధి, గ్రామస్తుల భాగస్వామ్యం, కమిటీ పనితీరును పరిశీలించారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రణాళికబద్ధమైన నిర్వహణ, పాఠశాల అభివృద్ధి ఎలా జరుగుతుందో అక్కడి ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆలేటి యాదవరెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలోనే 530 విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలగా గుర్తింపు పొందిందన్నారు. ఉపాధ్యాయులు రేణుక, రజిత, గీత, తల్లిదండ్రులు రాజమౌళి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా హనుమాన్ యజ్ఞం

నర్మెట: హనుమాన్ మాలధారణ దీక్షా స్వాములు శుక్రవారం హన్మంతాపురంలో మహా యజ్ఞకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు రాగుల భీరయ్య, బేజాడి మల్లేషం ఆధ్వర్యంలో 54 మంది స్వాములు స్వామివారికి చందన లేపనంతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో యజ్ఞక్రతువును పూర్తిచేసిన అనంతరం ఇరుముడి, మహాన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో స్వాములు యాట క్రాంతి కుమార్, దూసరి శ్రీనివాస్, బైరగోని చంద్రమౌళి, మూల కిరణ్, కాల్వ రాజు, ఎదునూరి కరుణాకర్, గుండ్లపల్లి రాజు, శ్రీనివాస్, దేవా, రాజేష్, ప్రవీణ్ , శేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలు పెంచాలి

చిల్పూరు: ఆర్యవైశ్యుల సభ్యత్వాలను మండలంలో పెంచాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల అధ్యక్షుడు మంతెన లవన్ కుమార్ అధ్యక్షతన ఆర్యవైశ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 44 సభ్యత్వాలు మాత్రమే ఉన్నాయని ఇంకా పెంచేందుకు కృషిచేయాలన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాదంశెట్టి వరూధిని, గంగిశెట్టి అనూజ, పడకంటి రవీందర్, జిల్లా రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి

జఫర్‌గఢ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని మోటివేషనల్ ప్రోగ్రామ్ ప్రొఫెసర్ టి.వెంకట్ రాజయ్య పేర్కొన్నారు. పీఎంశ్రీ నిధుల ద్వారా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆట పాటలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హెచ్‌ఎం ఎండీ పర్వాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు గురుకులాల ప్రవేశ పరీక్షలో ప్రతిభను చాటి ఐదో తరగతిలో సీటు సాధించారు. దూదిగాని నాగరాజు శైలజ సెంటర్‌లో తర్ఫీదు పొందిన కోటశ్రీకృతిస్వరాజ్, బత్తుల ప్రకృతి, కడారి అక్షర, శివరాత్రి రిషిక, ముక్కెర రేవంత్, చింతకుంట్ల రిత్విక్‌సాయిలు వివిధ గురుకుల పాఠశాలల్లో సీట్లు పొందారు. ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించడంతో సెంటర్ నిర్వాహకులను వారిని తల్లిదండ్రులు అభినందించారు.

పీఏసీఎస్ సెంటర్ ఎత్తివేతను అడ్డుకుందాం..

చిల్పూరు: కృష్ణాజీగూడెం గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఎత్తివేతను అందరం కలిసి అడ్డుకుందామని సీపీఎం గ్రామ కార్యదర్శి పోలు సంపత్ అన్నారు. కృష్ణాజీగూడెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేస్తే రైతులు ధాన్యం విక్రయించేందుకు వేరే గ్రామాలకు వెళ్లి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రుణాలు

బచ్చన్నపేట: సాల్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రుణాలను అందించనున్నట్లు ఐకేపీ సీసీ సందుల నర్సింహులు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సాల్వాపూర్‌ను ప్రభుత్వం పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిందని, ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారికి ఇంటి నిర్మాణానికి రూ. లక్ష రుణం అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంఘం తీర్మానం చేసి గ్రామైఖ్య సంఘాలకు ఇవ్వాలని సూచించారు.

కేంద్ర సాయంతోనే సన్నబియ్యం

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం సాయంతోనే నేడు రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ అమలు అవుతుందని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీని ఆయన పరిశీలించి మాట్లాడారు. నాయకులు ఉన్నారు.

ఎన్నిక

కొడకండ్ల: కొడకండ్ల జామా మసీద్ నూతన కమిటీని శుక్రవారం మత పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ హనీఫ్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ షన్నా, అబ్దుల్ సలీం, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఆసీఫ్, కోశాధికారిగా హమీద్, సభ్యులుగా ఖదీర్, నసీమ్, సలావుద్దీన్, నవాజ్,మహబూబ్, అఫ్రోజ్, ఏజాస్‌లు ఎన్నికయ్యారు.

ప్రమాదాల నివారణకు చర్య తీసుకోవాలి

చిల్పూరు: చిన్నపెండ్యాల నుంచి రాజవరం వెళ్లే రోడ్డులో మలుపు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవావాలని గ్రామ యువకుడు సాయికిరణ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

విరమణ పొందినా పాఠశాలకు సేవ అందించాలి

చిల్పూరు: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణలు తప్పవని.. అప్పుడప్పుడు తీరిక సమయంలో పాఠశాలకు సేవలు అందించాలని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కోరారు. పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కేతిడి నర్సింహారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీధర్‌రావు ఘనంగా సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

కొడకండ్ల: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తున్నారని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం మైదంచెరువు తండా అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దేవరుప్పుల: సీత్యతండాలో బీఆర్ఎస్ నాయకుడు విక్రమ్ మృతి చెందాడు. కాగా, శుక్రవారం బీఆర్ఎస్ మండ అధ్యక్షుడు తీగల దయాకర్ తదితరులు ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)